అభివృద్ధి కావాలా..? గుండాగిరి కావాలా..?



పరకాల : మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



పరకాల : రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న చల్లా ధర్మారెడ్డి

- తొడలు కొట్టి, మీసాలు తిప్పేవాడు సేవ చేస్తాడా..?
- ఆలోచించి ఓటు వేయండి
- బీఆర్‌ఎస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి 'చల్లా'
- పట్టణంలో భారీ రోడ్‌షో

పరకాల: ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో మళ్లీ గుండాగిరి కావాలా.. అభివృద్ధి కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని బీఆర్‌ఎస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి అన్నారు. బలవంతంగా పరకాల నియోజకవర్గ బరిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి గుండాలను వెంటేసుకొని తిరుగుతున్నాడని ఆరోపించారు. పట్టణంలో మంగళవారం అంబేడ్కర్ కూడలి నుంచి బస్టాండ్ వరకు చేపట్టిన ర్యాలీకి వేలాది మంది కార్యకర్తలు తరలివచ్చారు. ఈ ర్యాలీని ఉద్దేశించి ధర్మారెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజల ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని అన్నారు. ప్రజల చిరకాల కోరికైన రెవెన్యూ డివిజన్‌ను సాధించుకోవడంతో పాటు దేశంలో అతిపెద్ద పరిశ్రమలను స్థాపించుకోవడం జరిగిందన్నారు. ఆయా పరిశ్రమలతో వేలాది మందికి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. దళితబంధు విషయంలో ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆందోళన చెందొద్దన్నారు. విడతల వారీగా దళితబంధు వర్తింపచేస్తామన్నారు. డిసెంబర్ 15వ తేదీన ప్రారంభించనున్న కైటెక్స్ కంపెనీ ద్వారా 11వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు గ్రామాల్లో ఓట్ల కోసం వస్తే తెలంగాణకు ఏమి చేశారో నిలదీయాలని ప్రజలకు సూచించారు. 'మీసాలుతిప్పి, తొడలు కొట్టినోడు అభివృద్ధి చెస్తాడా.. సరిగ్గా ఊరి పేర్లు తెలియని రేవూరి గెలిస్తే ఏం చేస్తాడు' అని ప్రశ్నించారు. ఎన్నికలు రాగానే దొంగ వాగ్దానాలు చెప్పే కాంగ్రెస్, బీజేపీకి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని అన్నారు. 10 ఏళ్ల కాలంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటేయ్యాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నిప్పాని హైమావతి, వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

పనిచేసే ప్రభుత్వాన్నే గెలిపించాలి

గీసుకొండ : ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేసే బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్నే ప్రజలు గెలిపించాలని 16వ డివిజన్ కార్పొరేటర్ సుంకరి మనీషాశివకుమార్ అన్నారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ మహానగరంలోని 16వ డివిజన్ ధర్మారంలో బీఆర్‌ఎస్ పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి గెలుపు కోసం భారీ ర్యాలీ, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో జరిగిన అభివృద్ధి కళ్ల ముందే ఉందని, అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్‌కే ఓటు వేసి చల్లా ధర్మారెడ్డిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోయి గోసపడొద్దని అన్నారు. నాయకులు రాజయ్య, చిన్న, కిశోర్, రాజు, ఈశ్వర్, మల్లేశం, బాబు, రాజు ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గీసుకొండ : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రైతులకు అండగా ఉంటా..



చిట్యాల: కుమ్మరిపల్లిలో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి



టేకుమట్ల: హాజరైన జనం

- బీఆర్‌ఎస్ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి

చిట్యాల : మండలంలోని వరికోల్‌పల్లి, కుమ్మరిపల్లి గ్రామాల రైతులకు సంబంధించిన భూ సమస్యలను తీర్చే బాధ్యత తనదేనని, వారికి ఎల్లప్పుడు అండగా ఉంటానని బీఆర్‌ఎస్ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని వరికోల్‌పల్లి , కుమ్మరిపల్లి, గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయా గ్రామాల ప్రజలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఆయా గ్రామాల్లో వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యను అసెంబ్లీలో మాట్లాడడం జరిగిందన్నారు. అలాగే జిల్లా యంత్రాంగాన్ని తీసుకుని వచ్చి కొంత మేరకు భూ సమస్యను పరిష్కరించామన్నారు. తనకు మరో అవకాశం కల్పిస్తే ప్రధాన సమస్యను పూర్తిగా పరిష్కరించే బాధ్యత తనదేనని పేర్కొన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పెండెల సాంబయ్య, ఎంపీటీసీ కట్టికోళ్ళ రాజు, గ్రామస్తులు సాంబయ్య, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో వందశాతం దళితబంధు అందిస్తా..

టేకుమట్ల : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళిత బంధు పథకాన్ని ప్రభుత్వం ఏర్పడ్డ రెండేళ్లలో వందశాతం దళితబంధు అందిస్తానని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లీ ఆదరించాలని కోరారు. మాయ మాటలు చెప్పే వారు ఎన్నికల వేళ మీ ముందుకు వస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. ఇప్పటి వరకు మంజూరైన గృహలక్ష్మి యూనిట్లతో పాటు మరో ఐదువేల యూనిట్లను ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చారని, రానున్న రోజుల్లో మీ సొంతింటి కల నెరవేరబోతుందని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్, రైతుబీమా, రైతుబంధు, పేదింటి ఆడబిడ్డ పెళ్లికి కల్యాణలక్ష్మి వంటి పథకాలు కొనసాగాలంటే కారు గుర్తుకే ఓటు వేయాలన్నారు. 'నాటకాలు ఆడే వారిని నమ్మకండి, నేను రియల్‌గా ఉంటాను, నాపై పూర్తి విశ్వాసం ఉంచండి.. అభివృద్ధి అంటే చేసి చూపించాను. ఇంకా చేస్తానని' అన్నారు. జిల్లాలో కనీసం ఇంటర్ కాలేజీ కూడా లేని రోజుల నుంచి మెడికల్ కాలేజీ వరకు మంజూరు చేయించానని అన్నారు. భూపాలపల్లి రూపు రేఖలనే మార్చేసానని, భవిష్యత్‌లో కనీవిని ఎరుగని రీతిలో మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. అనంతరం పలు పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సట్ల రవి, ఆకునూరి తిరుపతి, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, పొలాల సరోత్తంరెడ్డి, ఆది రఘు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లి అర్బన్: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి



భూపాలపల్లి రూరల్ : సమావేశంలో పాల్గొన్న సేవాలాల్ సేన నాయకులు

ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ గెలుస్తా..

మొగుళ్లపల్లి : ప్రజల ఆశీర్వాదంతో మరోసారి భూపాలపల్లి ఎమ్మెల్యేగా గెలుస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని వేములపల్లి గ్రామంలో ప్రజా ఆశీర్వాద యాత్రలో గండ్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు పర్యాయాలు గెలిచిన ప్రతిక్షణం ప్రజల మధ్యలో ఉన్నాను తప్ప ఏ ఒక్కరోజు అవకాశ రాజకీయాలు చేయలేదని నమ్ముకున్న ప్రజలకు అభివృద్ధి పనులు చేసి మళ్లీ ఓట్లు అడుగుతున్నానని అన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులకు జెండా, ఎజెండా లేదని అధికార పార్టీని దూషించడమే పనిగా ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నారే తప్ప వాళ్లు అధికారంలోకి వస్తే చేసే పనులేంటో తెలుపలేని దుస్థితిలో ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల పేరుతో గ్రామాల్లో తిరుగుతున్న నాయకులను ప్రజలు ప్రశ్నించాలని అన్నారు. ఎన్నికలు రాగానే ప్రతిపక్ష పార్టీలు ప్రతిసారి తనను రాజకీయంగా ఎదుర్కొలేక చిల్లర విమర్శలు చేస్తూ పబ్బం గడుపుతున్నాయన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రైతులకు మీటర్ల పెడతారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు గంటల కరెంటు ఇస్తారు.. విజ్ఞులైన మొగుళ్లపల్లి మండల ప్రజలు ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఒక్కసారి ఓటు వేస్తే ఐదేళ్లు సేవకులుగా మీకు పని చేసే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ కోడారి రమేష్, వైస్ ఎంపీపీ పోల్నేని రాజేశ్వర్‌రావు, స్థానిక సర్పంచ్ బెల్లంకొండ మాధవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, గ్రామశాఖ అధ్యక్షుడు ఆరెల్లి రమేష్, సంపెల్లి నర్సింగరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాన నగరాలకు దీటుగా అభివృద్ధి

భూపాలపల్లి అర్బన్ : భూపాలపల్లి ప్రాంతాన్ని తెలంగాణలో ప్రధాన నగరాలకు దీటుగా అభివృద్ధి చేశానని బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీగా ఉన్న భూపాలపల్లిని మున్సిపాలిటీగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణంలో పీజీ, డిగ్రీ, ఇంటర్, ఐటీఐ కళాశాలలను ఏర్పాటు చేశామన్నారు. మెడికల్ కళాశాలను సైతం ఏర్పాటు చేసి అధునాతన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి గోదావరి జలాలను అందించినట్లు తెలిపారు.

గండ్ర వెంకటరమణారెడ్డికి పలుసంఘాల మద్దతు

భూపాలపల్లి రూరల్ : అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి మూడో సారి ఎమ్మెల్యేగా గెలిపించాలని జిల్లా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మేకల సంపత్ కుమార్ యాదవ్, ఎమ్మార్పీఎస్(టీఎస్) భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ శీలపాక హరీష్‌మాదిగ, సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ సంతోష్‌నాయక్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజేష్‌నాయక్ వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారి సంఘాల బాధ్యులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం యాదవులను గుర్తించి గొర్రెలు పంపిణీ చేయడం, ఎస్సీలను గుర్తించి దళిత బంధు, ఎస్టీలకు పోడు భూముల పట్టాలు, తండాల ఏర్పాటు, గురుకులాలు ఏర్పాటు చేశారని ఆయా సంఘాల నాయకులు తెలిపారు.ఈసందర్భంగా మరోసారి భూపాలపల్లిలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని, మంథని నియోజకవర్గంలో పుట్ట మధును గెలిపిస్తామని సమావేశాల్లో హామీలిచ్చారు. ఈ కార్యక్రమాల్లో సంఘాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా



ధర్నాలో పాల్గొన్న కార్మికులను పరామర్శిస్తున్న కీర్తిరెడ్డి



చిట్యాల: మాట్లాడుతున్న చందుపట్ల కీర్తిరెడ్డి

- మీ ఆడబిడ్డగా ఆదరించండి
- బీజేపీ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి

చిట్యాల : భూపాలపల్లి ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని కాల్వపల్లి, గిద్దెముత్తారం గ్రామాల్లో బీజేపీ భరోసా యాత్రలో భాగంగా గడప గడపకు ఎన్నికల ప్రచారం చేపట్టారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఆమె మాట్లాడుతూ.. తమ గ్రామాల్లో అభివృద్ధి కావాలంటే కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఇంటిని తీర్చిదిద్దేది మహిళలే కాబట్టి అందరూ కలిసి మహిళ అభ్యర్థిగా ఉన్న తనకు ఓటు వేయాలని కోరారు. నియోజక వర్గంలో పదవుల కోసం పార్టీలు మారే వ్యక్తులను కాకుండా పార్టీ, ప్రజల కోసం పని చేసే బీజేపీకే ఓటు వేయాలన్నారు. తాను గతంతో ఓడిపోయానని అయినా నమ్మిన సిద్ధాంతం కోసం పని చేస్తున్నన్నారు. మీ ఇంటి ఆడబిడ్డగా ఆదరించాలని కోరారు. బీజేపీ మేనిఫెస్టోలో అన్ని కులాల, వర్గాలకు మేలు జరిగే విధంగా సంక్షేమ పథకాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే బీసీని ముఖ్యమంత్రి చేయడం జరుగుతుందని దేశ ప్రధాని చెప్పారన్నారు. మాట తప్పే పార్టీ తమది కాదన్నారు. మాట తప్పే పార్టీలకు ప్రజలు తగిన గుణ పాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల రఘు, ఓబీసీ మోర్చా నాయకుడు పంచిక మహేష్ యాదవ్, బూత్ అధ్యక్షుడు బిస్కుల రవి, మండల కార్యదర్శి నల్లా శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గణేష్, కిరణ్, విజేందర్, రఘుపతి, రమేష్, మొగిలి, శ్రీనాథ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఒకసారి అవకాశం ఇవ్వండి..

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించి గెలిపించాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి ఓటర్లను విజ్ఞప్తి చేశారు. మంగళవారం భూపాలపల్లి పట్టణంలోని 4వ, 21, 24వ వార్డులు లక్ష్మినగర్, 6 ఇంక్లైన్ బ్యారక్‌లతో పాటు జెన్‌కోలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో కీర్తిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడప గడపకు ప్రచారం నిర్వహించారు. కీర్తి రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పాలించింది కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలేనన్నారు. వారు చేసిన అవినీతిని ప్రజలు గమనించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలనే రాష్ట్ర ప్రభుత్వం తమ పథకాలుగా చెప్పుకుంటుందని ఆరోపించారు. ఆపార్టీల నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. బీజేపీ పార్టీ కమలం గుర్తుకు ఓటేసి గెలిపిస్తే నియోజక వర్గాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తానని, మీ కష్ట సుఖాల్లో అండగా ఉంటానని హామీచ్చారు. కీర్తిరెడ్డి సమక్షంలో మహిళలు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు యుగేందర్, అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి నాణ్యమైన వైద్యం అందించాలి

భూపాలపల్లి రూరల్ : గుండెపోటుకు గురైన కార్మికుడికి నాణ్యమైన చికిత్స అందించాలని, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూపాలపల్లి మున్సిపల్ కార్మికుడికి పని ఒత్తిడి వల్ల గుండెపోటు వచ్చిందని, అధికారులు కార్మికులపై పని ఒత్తిడిని తగ్గించాలన్నారు. మంగళవారం ఉదయం అంబేడ్కర్ సెంటర్‌లో మున్సిపల్ కార్మికులు ధర్నా చేపట్టారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి ధర్నాలో పాల్గొని కార్మికులకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పై చిన్న చూపు చూస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బట్టు విజయ్‌కుమార్, రాష్ట్ర దళిత మోర్చా సభ్యుడు బట్టు రవి పాల్గొన్నారు.

ఇందిర గెలుపునకు నాయకుల ఇంటింటా ప్రచారం

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్, ఖిలాషాపూర్, నిడిగొండ, కంచనపల్లి, రఘునాథపల్లిలో మంగళవారం కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిర చేతి గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాలపై ఓటర్లకు వివరించారు. పలు గ్రామాల్లో చేతిగుర్తుకు ఓటేయాలని ర్యాలీలు నిర్వహించారు. రాష్ట్రంలో అధికారంలోకి రానుంది కాంగ్రెస్ పార్టీనే అని ఒక్కసారి ఇందిరకు అవకాశం కల్పించాలని ఓట్లను అభ్యర్థించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, నాయకులు నీలం యువరాజ్, మినుముల యాదవరెడ్డి, పోకల శ్రీనివాస్, చింత నరేష్, ఎండీ యాకుబ్, పసులాది రాకేష్, గిరబోయిన సతీష్, గ్యార నాగరాజు, దొరగొల్ల సత్తయ్య, కొత్తపల్లి కిరణ్, నోముల సత్తయ్య, మాటూరి పోశెట్టి, రమేష్‌తోపాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ తీస్తున్న కాంగ్రెస్ నాయకులు

రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దు

శాయంపేట : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తలు, యువకులు సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ మల్లేష్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే డయల్ 100కు ఫిర్యాదు చేయాలని లేదా స్థానిక పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, నలుగురికి మించి ఉండొద్దని సూచించారు. పోలింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల దూరంలో రాజకీయ నాయకులు బూత్ ఏర్పాటు చేసుకోవడానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. దాడులకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలు సహకరించాలి

ధర్మసాగర్: అసెంబ్లీ ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలు సహకరించాలని సీఐ శ్రీధర్‌రావు కోరారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో స్థానిక పోలీసులు, బీఎస్‌ఎఫ్ పోలీస్‌లతో కలిసి మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, నలుగురు కంటే ఎక్కువ మంది రోడ్డుపై ఉండకూడదని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ నిషేధమని ఆయన వెల్లడించారు.

క్లుప్తంగా

ఆదరించి ఆశీర్వదించండి

కమలాపూర్: అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన హుజూరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈటల రాజేందర్‌ను ఆదరించి ఆశీర్వదించాలని ఆయన సతీమణి ఈటల జమున కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు.

గెలిపిస్తే ఉచిత వైద్యం అందిస్తా

పరకాల: అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రతి పేద కుటుంబానికి రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు బీజేపీ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కాళీప్రసాద్‌రావు హామీ ఇచ్చారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీసీ బిడ్డగా బరిలో ఉన్న తనను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, కౌన్సిలర్ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించండి

ఐనవోలు: మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. మండలంలోని గర్మిళ్లపెల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో దర్శనాల సంపత్, కే నారాయణరెడ్డి అధ్యక్షతన సీపీఎం జనరల్ బాడీ సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత లౌకిక దేశాన్ని విచ్ఛిన్నం చేసిందని ఆరోపించారు. ప్రజలు బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. గర్మిళ్లపెల్లి సీపీఎం కార్యదర్శిగా రామ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బియ్యం అందజేత

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన నడిగొట్టు సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను స్థానిక ఎంపీటీసీ, ఉపసర్పంచ్ జమునసుమన్ మంగళవారం పరామర్శించారు. క్వింటాల్ బియ్యం అందించారు.


ప్రచారం పరిసమాప్తం

ఎల్కతుర్తి / శాయంపేట : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భీమదేవరపల్లి, ఎల్కతుర్తితో పాటు శాయంపేట మండలాల్లో చేపట్టిన ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల నిబంధనల మేరకు అధికారులు మద్యం షాపులు మూసివేయించారు. ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. ఎన్నికల ప్రచారం చివరిరోజు కావడంతో గ్రామాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటా తిరుగుతూ తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ఓట్లను అభ్యర్థించారు. అలాగే ఆయా గ్రామాల్లో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు.

కాంగ్రెస్ పార్టీ బైక్ ర్యాలీ

ఐనవోలు: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 500 బైక్‌లతో ర్యాలీ చేపట్టి చేతిగుర్తుకు ఓటు వేయాలని నినాదాలు చేశారు. 28డబ్ల్యూడీపీటీ052: బైక్ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

కమలాపూర్: కారు అదుపుతప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన మండలంలోని ఉప్పల్-కమలాపూర్ గ్రామాల మధ్యలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. జమ్మికుంట మండలం కేశవాపూర్‌కు చెందిన ఒకే కుటుంబంలోని నలుగురు కారులో కేశవాపూర్ నుంచి వరంగల్‌లో జరిగే ఓ ఫంక్షన్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఉప్పల్-కమలాపూర్ మధ్య పెద్దచెరువు మత్తడి సమీపం మలుపు వద్ద కారు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మైస సరోజన అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వెంటనే క్షతగాత్రురాలిని వరంగల్ ఎంజీఎంకి తరలించారు. కాగా కారులో ప్రయాణిస్తున్న మిగతా ముగ్గురు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.

కాంగ్రెస్, బీజేపీల మాయమాటలు నమ్మొద్దు

బీఆర్‌ఎస్ హుజూరాబాద్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

ఇల్లందకుంట/వీణవంక/కమలాపూర్: 'ఓ వ్యక్తిని నమ్మి ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు. నియోజకవర్గానికి ఒరగబెట్టిందేంటీ.. కేసీఆర్ దయతో మంత్రి పదవి అనుభవించిండు.. కానీ స్వార్థ ప్రయోజనాల కోసమే రాజకీయం చేసిండు. ఒక్క అవకాశం ఇచ్చి అసెంబ్లీకి పంపండి. అభివృద్ధి అంటే ఎంటో చూపిస్తా' అని బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. కమలాపూర్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు. ఇక్కడి ఎమ్మెల్యే రెండుసార్లు మంత్రిగా పని చేసి కూడా సొంత మండలం, నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఉపఎన్నికల్లో గెలిచి ఒక్కసారి మండలానికి రాలేదని, మంత్రిగా ఉండి మహిళా సంఘం భవనం కట్టించలేదని విమర్శించారు. కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు మర్చిపోవద్దన్నారు. 'మీ దయ, దండం పెట్టి, గదవ పట్టుకొని, మీ కడుపులో తలపెట్టి మరీ అడుగుతున్న నన్ను గెలిపించండి.. చేసిన వాగ్దానాలను తప్పకుండా నెరవేరుస్తా'నని అన్నారు. వేరేవారు గెలిస్తే అభివృద్ధి ఎలా జరుగుతుంది, తనను గెలిపిస్తే కమలాపూర్‌ను దత్తత తీసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. మీ ఆడబిడ్డగా కొంగుచాచి భిక్ష అడుగుతున్నా.. నా భర్తను గెలిపించాలని కౌశిక్‌రెడ్డి భార్య షాలిని కోరారు. మా డాడీని భారీ మెజార్టీతో గెలిపించాలని కూతురు శ్రీనిక ఓటర్లను వేడుకున్నారు. అనంతరం కార్యకర్తలు, మహిళలతో కలిసి కౌశిక్‌రెడ్డి డ్యాన్స్ చేశారు. కౌశిక్‌రెడ్డికి మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ రాణిశ్రీకాంత్, జెడ్పీటీసీ కల్యాణిలక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణరావు, వైస్ ఎంపీపీ శైలజఅశోక్, సర్పంచ్ విజయతిరుపతిరెడ్డి, ఎంపీటీసీలు వెంకటేశ్వర్లు, రాధికారమేశ్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి



జమ్మికుంటలో రాజేశ్వర్‌రావు ప్రచారం

భారీ మెజార్టీతో గెలిపించాలి

ఇల్లందకుంట మండలంబూజునూర్ గ్రామంలో ఎంపీపీ సరిగొమ్ముల పావనివెంకటేశ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హుజూరాబాద్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే పాడి కౌశిక్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ రామస్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొమురెల్లి, ఎంపీటీసీ విజయ-కుమార్, గ్రామశాఖ అధ్యక్షుడు విక్రమ్, మాజీ ఎంపీటీసీ రామ్ స్వరణ్‌రెడ్డి, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయం

వీణవంక మండలంలోని చల్లూరు, ఇప్పలపల్లి, బేతిగల్, కనపర్తి, ఘన్ముక్కుల గ్రామాలలో పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా నాయకులు ప్రచారం నిర్వహించారు. హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

గడపగడపకు ప్రచారం

జమ్మికుంట పట్టణంలో పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, పట్టణ ఆర్యవైశ్యుల సంఘం అధ్యక్షుడు ఐత మహేశ్ గడపగడపకు ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టనున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. ఒక్కసారి పాడి కౌశిక్‌రెడ్డికి అవకాశం కల్పించాలని కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీలను నెరవేరుస్తుందన్నారు.